# భగవంతుని భజించి, పూజించి, స్మరించి తరించండి

సత్యధర్మ అహింసయు శాంతిప్రేమ
మానవుని పంచప్రాణాలు మహిని యివియే
పంచప్రాణాలలో ప్రేమ యెంచ హెచ్చు
కాన హృదయాన ప్రేమను గట్టిపరచు
నేటి విద్యలన్ని నిధి సేకరణకౌను
పూర్ణవిద్యలన్ని పూజ్యమయ్యె
పక్షి పలుకులిడునె బహువిధ బోధనల్
సత్యమైన బాట సాయిమాట

దివ్యాత్మ స్వరూపులారా!

మానవ సమాజములో ప్రధానముగా వుండవలసినది మానవత. మానవతయే లేకుండిన సమాజము మానవునకు గుదిబండగా రూపొందుతుంది. ఎన్ని విద్యలను అభ్యసించినప్పటికినీ, యెన్ని పట్టములు అందుకొన్నప్పటికి, అంతమాత్రముచేత తృప్తిపడక దానితోపాటు మానవతను పెంచుకొనుటకుకూడను ప్రయత్నించాలి. మానవత యెంత పెరుగునో సమాజము, దేశముకూడను అంత అభివృద్ధినొందుతుంది. మానవత యెంతపవిత్రమో, దానిని పోషించుకోటంకూడను అంత పవిత్రమైన కర్మ. దీనికి సమరసము, సమన్వయము అత్యవసరము. వివిధ పరిధులమధ్య సామరస్యము, సమన్వయము వుండినప్పుడే సమాజము శోభిస్తుంది.

srisathyasaivachanamrutam

జీవితములో నిత్యసత్యములుగా ప్రకాశించే ప్రాచీన సాంప్రదాయములను సంరక్షించుకొని కాలానుగుణ్యముగా సమన్వయము గావించుకొనటమే ప్రధానమైన విద్య. సామరస్య, సమన్వయములను మానవత అభివృద్ధి గావింపజేస్తుంది. మానవునియందలి గుణములను పోషిస్తుంది. మానవత్వాన్ని వికసింపజేస్తుంది. మానవతను మనము కల్పించుకొనుటకు వీలుకాదు. కొత్తగా మనము సంపాదించుకొనే పద్ధతికాదు. ఇది మన స్వభావమైనది. ఇది మన స్వరూపమైనది. ఇట్టి నిత్యసత్యమైన మానవతను మనము యీనాడు విస్మరిస్తూ వస్తున్నాము. ఇట్టి మానవత్వాన్ని మనము అభివృద్ధి గావించుకున్నప్పుడే మనము మానవుడని పిలిపించుకోవటానికి ఒక అధికారాన్ని అందుకోగలము.

**మానవుని జీవితము సమాజమునందే సార్థకమవుతుంది**

కుళ్లిన పదార్థమును మనము యేవిధముగా బయట పారవేస్తామో అదే విధముగ కృశించిన కర్మలు ఆచరించిన వ్యక్తులనుకూడ సమాజము తీసిపారవేస్తుంది. 'సమాజమునకు, మనకు వుండిన సంబంధబాంధవ్యము యేమిటి? సమాజనిమిత్తమై మనము యెందుకు బ్రతకాలి? సమాజమునకు మనపై వుండిన పెత్తనము యేమిటి?' అని దీర్ఘముగా విచారించినప్పుడు సమాజమునందే మన జీవితము సార్థకమవుతుంది. దీనికి కారణం సమాజమునందే పుట్టి, సమాజమునందే పెరిగి, సమాజమునందే జీవించి, సమాజమునందే మనము అంతమొందుచున్నాము. సమాజమును వదలి మనము క్షణమైనకూడను జీవించలేము. 'సమ్' అనగా యేకత్వము. 'అజ్' అనగా గమనము. సమత్వమును గమనించటమే సమాజమునకు సరైన అర్థము. ఏకత్వమును గమనించటమే సమాజముయొక్క లక్ష్యము. అనేకులు ఆర్జించిన క్రియాఫలములు ఒక్కచోట చేర్చిన సంస్థకే సమాజము అని పేరు.

ఈ సమాజమునకు సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస అన్నవే పంచప్రాణములు. అంతర్, బహిర్దేహముయొక్క ఐక్యతలే దీని ఉచ్ఛ్వాసనిశ్వాసములు. దీనినే ప్రజ్ఞ అనికూడ పిలుస్తూవచ్చారు. Constant Integrated Awareness అని అనగా దీనియొక్క తత్త్వము

sri sathyasai vachanamrutam

శరీరమునందును, మనసునందును, అంతఃకరణయందును, ఆత్మయందుకూడను సమత్వముగా ప్రకటిస్తూవున్నది. ఇది మానవుని తత్త్వముతో చేకూరినదే కాని అన్యముగా యేర్పడినదికాదు. ఇది ఒక పుష్పము. ఈ పుష్పమునకు ఆధారము యేమిటి? దీనికి రేకలే ఆధారము. రేకలు వుండినప్పుడే పుష్పమునకు అందము. రేకలే లేకుండిన పుష్పములేదు. అదే విధముగనే ప్రతివ్యక్తి సమాజమునకు ఒక రేకవంటివాడు. ఇలాంటి వ్యక్తులయొక్క సమూహమే సమాజమనే పుష్పము. ఈ వ్యక్తులయందు పవిత్రమైన దివ్యత్వమనేది ప్రకటితము కావాలి.

**వ్యక్తులయొక్క గుణస్వరూపమే సమాజముయొక్క స్వరూపము**

ఈ సమాజ రథమునకు నాలుగు చక్రములు. ఒకటి ఐకమత్యము. రెండవది స్వాధీనము. మూడవది జ్ఞానము. నాల్గవది శక్తి. ఈ నాలుగు శక్తులతోకూడిన చక్రములే సమాజమును నడుపుతూ వస్తున్నవి. ఇలాంటి సమాజతత్త్వములోపల మానవత్వమును యేవిధముగా పోషించుకోవాలి? నిజముగా యీ సమాజమనేది అనేక రూపములతో లేదు. ఇది ఒకే రూపాన్ని ధరించివుంది. ఈ సమాజమునకు ప్రత్యేకించి ఒక పంచభూతస్వరూపములేదు. వ్యక్తులయొక్క గుణస్వరూపమే యీ సమాజముయొక్క స్వరూపము. ఈ జగత్తునందు జీవి, పదార్థము యీ రెండింటియొక్క సమన్వయము మనము నిరూపించాలి. ఇవి రెండు భిన్నములు కావు. ఈ రెండింటియందు యేకత్వాన్ని మనము సరైన రీతిగా గ్రహించినప్పుడే యిందులో దైవత్వము రూపొందుతుంది. దీని అనుభూతినికూడను మనము అనుభవించాలి. కనుక అనుభవించువాడు, అనుభవించబడునది, అనుభవము యీ మూడు, అనగా experiencer, experienced, experience ఏకము కావాలి. Seer, seen and seeing ఈ మూడింటిని మనము మూడు విధములుగా భావించరాదు. ఇవి త్రిపుటికాదు. ఇది యేకత్వముతోకూడినది. చూచుట, చూడబడుట, చూచేవానితో యేకమైపోతుంది. చూచేవాడు లేకుండిన చూపుకాని, చూడబడునదిగానీ యేమాత్రము విలువలేదు. చూచునటువంటివాడే కర్త, ఆ కర్తనే ప్రజ్ఞ, ఈ ప్రజ్ఞనే బ్రహ్మము అన్నారు. ఈ ప్రజ్ఞనే ఆత్మ అన్నారు. ఈ ప్రజ్ఞనే మానవుని విలువ. ఈ

sri sathyasaivachanamrutam

ప్రజ్ఞనుంచి ఆవిర్భవించే ప్రతిక్రియకూడను మానవతను చేకూరుస్తుంది. మానవుడు యేకాకిగా జీవించే స్వభావుడుకాదు. మానవకోటిమధ్య ప్రేమ బీజములు నాటి సహన ప్రసూనములను వికసింపజేసి, శాంతి ఫలములు సమాజమునకు అందించినవాడే మానవుడు.

**వేదాంతపరిభాషయందు మానవతావిలువలు**

యిట్టి పవిత్రమైన మానవత్వాన్ని ఈనాడు మనము విస్మరిస్తున్నాము. దీనినే ప్రాచీనకాలమందు, వేదపరిభాషయందు, అష్టాంగయోగములందు మొట్టమొదటిదియైన 'యమ' అనుదానికి పోల్చుకుంటూవచ్చారు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి యివి అష్టాంగయోగములు. ఇందులో మొట్టమొదటిది 'యమ'. 'యమ' అనగా యేమిటి? అహింస, సత్యము, ఆస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, ఈ ఐదుకూడను వేదాంతపరిభాషయందు మానవతావిలువలు. ఇక్కడ అహింస అనగా యేమిటి? అహింస అనగా కేవలము ఒకరిని హింసించకుండా వుండటమని మనము భావిస్తున్నాము. యేవిధముగా మనము యితరులను హింసించకుండా వుండటం? ఈ అహింస అనే దానికి అర్థము యేమిటి? మనసు, మాట, దేహము యీ మూడింటితోకూడను త్రికరణశుద్ధిగా యితరులను హింసించకుండుటయే అహింస. ఇది ప్రధానమైన మానవతావిలువ. ఈ విలువను సంపాయించుకున్నవాడే సత్యము అనే రెండవది తాను అనుభవించటానికి అర్హుడౌతాడు.

సత్యము అనగా కేవలము నాలుకతో పలికినది మాత్రమేకాదు. ఇది త్రికాలాబాధ్యమైనది. త్రిగుణశుద్ధితో వుండవలసినది. మనసునందుకాని, చేతులతోకాని అసత్యమును ప్రకటించటానికి ప్రయత్నించకూడదు. త్రికరణశుద్ధితో మనము పలికేటువంటిదానినే మనము యీనాడు 'సత్యము' అని భావిస్తున్నాము. ఇది రెండవ మానవతాగుణము.

'ఆస్తేయము' అనగా పరులసొత్తును మనము అపహరించకుండా వుండటం. కేవలము చేతులతో వారి పదార్థములను అపహరించటము మాత్రమేకాదు, మనసులోకూడను

sri sathyasai vachanamrutam

పరవస్తువులను అపహరించటానికి సంకల్పము రాకూడదు. వాక్కుతోకూడను పరవస్తువులను అపహరించమని బోధించరాదు. కనుక, త్రికరణశుద్ధిగా పరులసొత్తును అపహరించకుండా వుండటమే అస్తేయము. ఇది మూడవ మానవతావిలువ.

నాల్గవది బ్రహ్మచర్యము. దీనిని అనేక విధములుగా లౌకిక మార్గమునందు ప్రవేశపెట్టి అనేక అర్థములతో మనము వింటూ వస్తున్నాము. ఇవేవీ సరైన అర్థములుకావు. బ్రహ్మచర్యమనగా నిరంతరము యే పని చేసినా, యే పలుకు పలికినా, యే తలంపు తలచినా, యిది బ్రహ్మభావమైన తలంపుగా వుండాలి. కర్మగా వుండాలి. అనగా బ్రహ్మభావముతో ఆచరించేదే బ్రహ్యచర్యము అన్నారు. ఈ సర్వకర్మలు, సర్వ విధములైన పలుకులు, సర్వవిధమైన భావములు భగవదర్పితముగా భావించాలి. దీనినే 'సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థం' అని పలుకుతూ వచ్చారు. కేవలము ఒక్క దేహముచేత మాత్రమే పవిత్రముగా వున్నంత మాత్రమున చాలదు. దేహము అనిత్యమైనది. మన కర్మలు సత్యమైనవి. మనసే లేకుండిన కర్మలేమాత్రము చేయలేవు. మనసుకు, కర్మలకు సన్నిహిత సంబంధబాంధవ్యము వుంటుండాది. కనుకనే నిత్యసత్యమైన మనోభావములతో కూడిన కర్మలు భగవత్ ప్రీత్యర్థంగా వుంటుండాలి. ఎప్పుడు భగవత్‌భావము యేర్పడుతుందో అప్పుడు తప్పు మార్గములో ప్రవేశించుటకు వీలుకాదు. సర్వకర్మలు భగవంతునికే అర్పితము. కారణమేమనగా ఆత్మనుండి అహం పుడుతూ వున్నది. ఈ అహంనుండి తలంపులు పుడుతున్నాయి. తలంపులనుండి వాక్కు పుడుతున్నాది. కనుక, వాక్కుకు ఆధారము తలంపు. తలంపుకు ఆధారము అహం. అహంకు ఆధారము ఆత్మ. కనుక, మనము చేసే సర్వకర్మలుకూడను ఆత్మాధారముతోనే చేస్తున్నాము. సర్వకర్మలు, సర్వ పలుకులుకూడను ఆత్మాధారముతోనే మనం చేస్తున్నాము, పలుకుతున్నాము. సర్వసంకల్పములు ఆత్మాధారముతోనే సంకల్పిస్తున్నాము. ఆత్మ తండ్రి, అహం కొడుకు, తలంపు మనుమడు, వాక్కు మునిమనుమడు. వీరందరు ఒక కుటుంబానికి చెందినవారు. కనుక వాక్కు భగవత్ ప్రీత్యర్థంగా వుంటుండాలి. మన thoughts అంతా భగవత్ ప్రీత్యర్థంగా వుంటుండాలి. మన అహంకూడను భగవత్ ప్రీత్యర్థంగా వుంటుండాలి. అప్పుడే అహంబ్రహ్మాస్మి. అదే బ్రహ్మగా మారుతుంది. ఆ బ్రహ్మమే ప్రజ్ఞ. కనుక సమస్తము

ప్రజ్ఞనుండియే ఆవిర్భవిస్తున్నాయి. దీనినే బ్రహ్మచర్యము అన్నారు. ఇది నాల్గవ మానవతావిలువ.

ఐదవది అపరిగ్రహము. 'ఒకరిసొత్తును, దానమును, ధర్మమును మనము అందుకోరాదు'. అని నేటి భాషలో మనము యీ జగత్తునందు వుపయోగపెడుతున్నాము. ఇది దీనియొక్క సరైన అర్థము కాదు. యే పని చేసినప్పటికిని ఫలమును ఆశించకుండా ప్రతిఫలమును మనము కోరకుండా కర్మలాచరించాలి. ప్రతిఫలాపేక్షలేని కర్మలు మనము ఆచరించాలి. అహంకారరహితమైన కర్మలు ఆచరించాలి. అభిమాన, మమకారరహితములైన కర్మలు ఆచరించాలి.స్వార్థ, స్వప్రయోజన రహితమైన కర్మలు మనము ఆచరించాలి. ఇదే అపరిగ్రహము. కానీ, యీనాడుస్వార్థముచేతను, స్వప్రయోజనముచేతను మనం సమస్తకర్మలు ఆచరిస్తున్నాము. అభిమాన, మమకారములచేత కర్మలు ఆచరిస్తున్నాము. అహంకారముచేత మనము కర్మలాచరిస్తున్నాము. కనుకనే యివి మానవతాకర్మలు కాలేకపోతున్నాయి. కనుక, మానవతా విలువలు మనము పోషించుకోవలెనన్న యీ విధమైన త్రిగుణములతోకూడిన, త్రికరణశుద్ధితోకూడిన కర్మలను ఆచరించాలి. ఈ ఫలాపేక్షలేని కర్మలు మనము ఆచరించాలి. ఏ పూజలు చేసినా, ఏ వ్రతములుచేసినా, యేయాత్రలు వెళ్లినా యేదో ఒక స్వప్రయోజన నిమిత్తమై ఆచరించే కర్మలేగాని, ఫలరహితమైన పూజలుగాని, ఫలరహితమైన కర్మలుగాని, ఫలరహితమైన సాధనలుగాని మనము యీనాడు చేయటంలేదు. ఇది మానవతావిలువకాదు. కారణమేమనగా మానవత్వమందు దైవత్వము వుండికూడను పామరత్వములో పడి, ప్రాకృతసంబంధమైన వాంఛలలో మునిగి ఆనందమును కోల్పోతున్నాము. జ్ఞానమనేది కేవలము త్యాగమయమై వుంటుండాలి. త్యాగమయమైనదే జ్ఞానము. రాగమయమైనది జ్ఞానము కానేరదు.

**హృదయమనే క్షేత్రమునందు జ్ఞానము నిండుగా ఉంటున్నది**

సీత భూజాత. ఈమె బంగారు లేడిని చూచింది. ఈమె జ్ఞానమయమైనది. కానీ రాగము ప్రారంభము కాగానే ధర్మము, సత్యము చివరకు పరమాత్మను అనగా, రాములనుకూడను

దూరము చేసుకుంది. ఏనాడు తిరిగి యీ సీత జ్ఞానమయము, త్యాగమయముగా మారిందో ఆనాడే రాములతో చేరింది. ఈ జ్ఞానమయమైన సీతను కోల్పోటంచేత రాములు తిరిగి ఆ జ్ఞానమును సంపాయించుకొనుటకు అనేక ప్రయత్నములు, సాధనలు చేశాడు. వెదుకుతూ వెదుకుతూ కడపటికి ఋష్యమూక పర్వతము చేరాడు. ఋష్యమూకమనగా యేమిటి? వైరాగ్యము. ఎప్పుడు వైరాగ్యమును సాధించెనో అప్పుడు సీత అతనికి చేరింది. యీ జ్ఞానమయమైనది యెక్కడ లభిస్తుంది? సీత యెక్కడ పుట్టిందో జ్ఞానమక్కడ పుట్టింది. ఈ జగత్తునందే భూమియందే సీత పుట్టింది. కనుక యిక్కడకూడను జ్ఞానము క్షేత్రమునందే పుడుతున్నాది. క్షేత్రమనగా యేమిటి. మన హృదయ క్షేత్రము. ఆ హృదయమనే క్షేత్రమునందే జ్ఞానము సమృద్ధిగా వుంటున్నాది.

**మానవత్వము మనము బయటినుండి సంపాదించుకొనేది కాదు, సహజముగా మనలో ఆవిర్భవించేది**

పాలను మథనము చేసినప్పుడు యే విధముగా మొదట వెన్న తగులుతుందో, ఆ హృదయాన్ని మథనము చేసినప్పుడు అక్కడ జ్ఞానమనే వెన్న చేజిక్కుతుంది. ఈ నవనీతము అతి పరిశుద్ధమైనది. అతి మధురమైనది. అతి మృదువైనది. ఇలాంటి జ్ఞానము మనయందే వుంచుకొని అజ్ఞానముచేత అనేక వాంఛలను పెంచుకొని మన మానవత్వాన్నే దానవత్వముగా మార్చుకుంటున్నాము. ఈనాడు మానవుడు స్వార్థములో మునిగిపోతున్నాడు. తాను తిన్నంత మాత్రమున తృప్తి పడటంలేదు, మానవుడు. ఇంకా తరువాత తరములకు కావలసిన సామగ్రిని ప్రోగుచేసుకుంటున్నాడు. దాని నిమిత్తమై ఆరాటపడుతున్నాడు. ఆ ఆరాటములోనే అసంతృప్తిని పొందుతున్నాడు. ఆ అసంతృప్తితో యిహమునందు, పరమునందు రెండింటియందు సుఖములేకుండా అసంతృప్తిని పొందుతున్నాడు. పశుపక్షులు తిని తృప్తిపొందుతున్నాయి. వాటికి స్వార్థము యేమాత్రములేదు. దాచుకొనే స్వార్థము, దోచుకొనే దౌర్బల్యము పశుపక్షులకు లేవు. ఈ దాచుకోటము, దోచుకోటము కేవలము మానవునియందే దుర్బుద్ధులుగా అభివృద్ధి పొందుతున్నాయి. పశుపక్షులలో లేని పాడుగుణములు మానవులలో ప్రవేశిస్తున్నాయి.

srisathyasaivachanamrutam

దీనికి కారణంయేమిటి? పశుత్వము మానవునియందు శేషించి వుండటమే దీనికి మూలకారణము. ఈ పశుత్వము యెంతవరకు వుండునో అంతవరకు మానవత్వము అందులో ప్రవేశించదు. కనుక, ముందుగా మనయందున్న పశుత్వాన్ని మనము పారద్రోలాలి. దీనిని పారద్రోలినప్పుడే దివ్యత్వమైన మానవత్వము మనలో ప్రవేశిస్తుంది. మానవత్వము సంపాదించుకొనేదికాదు. సహజముగా మనలో ఆవిర్భవించేది.

కాలముయొక్క విలువను మనము గుర్తించుకోలేకపోతున్నాము. దీనిని గుర్తించుకున్నప్పుడే మానవుడు కాలస్వరూపుడుగా మారతాడు. సర్వము కదలించెడి కాలమూర్తికి నమస్కారము అన్నాడు, భృగు మహర్షి. కానీ, మనము కాలమును అపవిత్రముగావిస్తున్నాము. కాలము దుర్వినియోగము చేస్తున్నాము. ఈవిధంగా కాలమును దుర్వినియోగము చేయటమువలనే జీవితము దుర్వినియోగమై పోతున్నది. మనము యేమి చేసినప్పటికిని, నిత్యానిత్యవిషయ పరిశీలనాశక్తితో దానిని పరిశీలన జరపాలి. అలాంటి ప్రజ్ఞను మనము యీనాడు సంసాయించుకోవాలి. దానిని పోషించుకోవాలి. ఇవి మానవతా విలువలు. ఇతరులనుండి అందుకొనేవి కాదు. గ్రంథాలు చదివి పోషించుకొనేవికాదు. గురువులనుండి నేర్చుకొనేవికాదు. వీటిని మనము స్వయముగా ఆచరించి అనుభవించాలి.

**మానవుడనగా నమ్మకము కలిగినవాడు**

'నేను మానవుడను, నేను మానవుడను' అనే సంపూర్ణవిశ్వాసమును మనము పెంచుకోవాలి. 'మానవుడు' అనగా నమ్మకము కలిగినవాడు. ఆ నమ్మకముచేతనే మనము జయము పొందాలి. కానీ, యీనాటి మానవునకు నమ్మకమనేది క్షీణించిపోయింది. తనను తానే నమ్మలేకపోతున్నాడు. తనను తాను నమ్మనటువంటివాడు దేనిని నమ్మగలడు? ఇలాంటి బలహీనుడు మానవుడేకాదు. త్రికరణశుద్ధితో మనము అన్ని విధములైన పవిత్రతలను ఆచరించాలి. మానవునియందు ప్రధానమైనది, విలువైనది, పలుకు. మనము యీయొక్క పలుకును వ్యర్థము చేయకూడదు. వాక్యాన్ని అలక్ష్యము చేసినప్పుడు జీవితమే వ్యర్థమైపోతుంది.

**భగవంతుడులేని వస్తువుగాని, స్థానముగాని లేదు**

ప్రేమస్వరూపులారా! ఈనాడు మానవతావిలువలనేవి జగత్తునకు అత్యవసరము. ఇవే విద్యారంగములో అభివృద్ధి గావించాలని ప్రయత్నిస్తున్నారు. నైతిక, ధార్మిక, లౌకిక, వైజ్ఞానిక మార్గములందు యివి యేమాత్రము అభివృద్ధి గాంచలేవు. ఒక్క ఆధ్యాత్మికమునందు మాత్రమే దీనిని అభివృద్ధి గావించవచ్చును. భక్తిలేక మానవత్వము యేమాత్రముకూడను అభివృద్ధి పొందలేదు. మొట్టమొదట దైవవిశ్వాసాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. దైవము వున్నాడా లేదా అనే సందేహము. కొందరు కలదని, కొందరు లేదని వాదన. నా వుద్దేశ్యమేమనగా కలదు అనేవాడు, లేదు అనేవాడుకూడా దానిని చూచివుంటేనే కలదు, లేదని చెప్పటానికి అర్హుడౌతాడు. ఏదైనా ఒక పదార్థము వున్నది, లేదని చెప్పాలనుకుంటే ఆ పదార్థముయొక్క తత్వాన్ని చక్కగా మొట్టమొదట గుర్తించి వుండాలి. ఎప్పుడైన ఒక తూరి యిది గులాబి పుష్పము అని చూచివుంటేనే 'యిక్కడ గులాబి పుష్పము వుంటుండాది, స్వామి చేతులో', అని చెప్పవచ్చు. ఈ గులాబి పుష్పమును చూడనివాడు యీ పుష్పము స్వామి చేతులో వుందని యే రీతిగా చెప్పగలడు? అదే విధముగనే దేవుడు వున్నాడు, లేడు అని చెప్పటంకంటే దేవుడంటె యెలాంటివాడు, ఎవ్వడు అనేది తెలుసుకుంటే కదా వున్నాడు, లేడు అని చెప్పటానికి అర్హుడౌతాడు? లేనిదానిని వున్నాడని చెప్పటము మూర్ఖత్వము. ఎక్కడైనా ఒక వ్యక్తి తప్పించుకు పోయినప్పుడు ఆ వ్యక్తి యెక్కడ వున్నాడో ఆ చోటికి పోయి వెదికితే ఆ వ్యక్తి మనకు లభిస్తాడు. అతను లేని ప్రదేశములో యెంత వెతికినను మనకు కనిపించడు. అయితే భగవంతుడు యెక్కడ వున్నాడు? ఎక్కడికి పోయి వెతికేది? భగవంతుడు సర్వత్రా వుంటున్నాడు. కనుక, యితనిని వెతకనక్కరలేదు. మనము చూస్తున్నదంతా పరమాత్మస్వరూపమే! అంతా పరమాత్మస్వరూపమే! విశ్వం విష్ణుస్వరూపం. ప్రపంచాన్ని భగవంతుని స్వరూపములో చూస్తున్నాము. భగవంతుడు లేడు అంటున్నాము. యింతకంటే మూర్ఖత్వము యెక్కడవుంది? సర్వము భగవంతుడే! భగవంతుడు లేని వస్తువుగాని, స్థానముగాని మరెక్కడనులేదు. కనుకనే మనము సర్వము భగవంతునియొక్క స్వరూపముగా విశ్వసించాలి. అలాంటి విశ్వాసము మనము అభివృద్ధి గావించుకున్నప్పుడే నిజమైన మానవత్వాన్ని అభివృద్ధి గావించుకోగలము.

sri sathyasai vahini / vachanamrutam

**బోధనలతోబాటు ఆచరణకూడా అత్యవసరము**

సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస అని పేర్లు చెప్పినంతమాత్రమున మానవతావిలువలు పోషించుకోలేము. కేవలము నోటితో చెప్పవచ్చును. కనుకనే 'సత్యంవద', 'ధర్మంచర' అన్నారు. ఆచరించు అన్నారు. అయితే, యీ ధర్మమును మర్మముగా ఆచరించినప్పుడు కర్మ మనను చాలా బాధ పెడుతుంది. ధర్మములో మర్మము వుండకూడదు. ఏ విధమైన మర్మము లేని ధర్మము. మర్మముతో కర్మలు ఆచరించినప్పుడు అది మనకు బంధనగా యేర్పడుతుంది. మర్మము లేకుండా వుండటానికి సత్యముతో ధర్మము నాచరించాలి. అందువలననే వేదాంతము 'సత్యంనాస్తి పరోధర్మః' అన్నారు. ధర్మమనేది సత్యమనే పునాదులపైన ఆధారపడి వుంటుండాది. సత్యజీవితాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి. సత్యాచారముతోనే ధర్మము నాచరించాలి. ఈ ధర్మమయముతోనే మనము శాంతిని పొందాలి. ఈ శాంతి రూపముతోనే శాంతిని అనుభవించాలి. ఈ ప్రేమనే అహింసగా మార్చుకోవాలి. ప్రేమ యెక్కడ వున్నదో అక్కడ హింస చేయటానికి వీలుండదు. కనుక యివన్నీకూడను ఆచరణలో నిరూపించవలసినవే కాని కేవలము బోధనలతో నిరూపించేటువంటివికాదు. కనుక యీనాడు బోధనలతో బాటు ఆచరణకూడను అత్యవసరము.

**మానవతా విలువలను బోధించేవారు ముందుగా తాము వాటిని ఆచరించి చూపాలి**

ఇక్కడ అనేకమంది ఉపకులపతులు వుంటున్నారు. కానీ వారి వారి భావములు వేరు. వారంతా object వైపు ప్రయాణము చేస్తున్నారు. భౌతికమైన ప్రాకృత దృష్టితో వారు పోతున్నారు. కానీ నేను Innerview లో వున్నాను. నాది subject, వారిది object. దానికి, దీనికి పొత్తు కుదరదు. నా వుద్దేశ్యము యేమంటే కాలేజీల్లోకాని లేక స్కూల్సులోగాని యీ మానవతావిలువలు బోధించటమనేది శాశ్వతమైనదికాదు. ఏదో తాత్కాలికముగా విద్యార్థుల మనస్సులలో కొంత అభివృద్ధిని సాధించవచ్చునేగాని, ఇది శాశ్వతముగా నిలచేదికాదు. బోధనలచేత మనము జగత్తును మార్చలేము. హృదయాన్ని యే విధముగా పరివర్తన గావించగలము? ఆచరణతోనే దీనిని పరివర్తన గావించాలి. మనము

sri sathyasai vachanamrutam

క్రమక్రమేణా యేదీ బోధించనక్కరలేదు. మన discipline మనము చక్కగా నడచుకుంటే దానిని చూచి జగత్తు అనుసరిస్తూవస్తుంది. ఒక చిన్న ఉదాహరణ. ఒక Vice-Chancellor వున్నాడు. ఆ Vice-Chancellor ప్రతి దినము 8 గంటలకంతా universityకి చేరాలి. ఆ విధమైన నిష్టప్రకారము correct గా 8 గంటలకు ఆ Vice-Chancellor University చేరుతూవుంటే యీ ఆధారమును పిల్లలు అనుసరిస్తారు. ఒక time table అనుసరించి సక్రమముగా పనులను ఆచరించాలి, కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. ఎనిమిది గంటలకల్లా పిల్లలు ప్రవేశించాలని పెట్టి తాను పది గంటలకు విద్యాసంస్థకు పోతే పిల్లలు యే విధముగా దానిని ఆచరించగలరు? కనుక, మొట్టమొదట మనము యీనాడు మన ఆచరణలో మార్పు చేసుకోకుండా పిల్లలకు మానవతావిలువలు బోధించటానికి వీలుకాదు. మనము ఆచరిస్తూవస్తే దానిని చూచి వారు అనుసరిస్తూవస్తారు. తల్లితండ్రులు ఆచరించినప్పుడే పిల్లలు వారిని అనుసరిస్తూ వస్తారు. తల్లితండ్రులు యెప్పుడు చూచినా అసత్యములాడుచుంటే పిల్లలను సత్యము చెప్పమంటే యే రీతిగా చెప్పగలరు? వారు అధర్మమార్గములో పోతూ పిల్లలను ధర్మంగా నడచుకో నాయనా అంటే యే విధంగా నడచుకోగలరు? కనుక, దేశములో యీ మానవతావిలువలు యెవరు కోరుతూన్నారో వారు యీ సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను అనుభవించి, ఆచరించి అందించటానికి ప్రయత్నించాలి. అట్లుకాకుండా కేవలము బోధనలచేతనే మారుతుందంటే యిది సరైన మార్పుకాదు. చిన్న చిన్న పిల్లలనుండియే అది అభివృద్ధిగావించాలి. విద్యావంతులైనవారందరు యీ విషయాన్ని చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి.

పవిత్రమైన మానవతా విలువలను మనము ప్రచార, ప్రబోధలు చేయవలెనంటె ప్రభుత్వముతో మనము దూరముగా వుంటుండాలి. ప్రభుత్వముచేత యీ విధమైన పవిత్రమైన మార్గములు యేనాటికి విజయము సాధించలేవు. యేదో పవిత్రమైన హృదయము గల్గినవారు కొందరు కొన్ని శాసనాలు చేయవచ్చు. కాని, ప్రభుత్వము తరుచు మారుతూ వుంటుంది. అట్టి పరిస్థితులలో మన values యేమైపోతాయి? మన పాదాలపైన మనము నిలబడాలిగానీ మరొకరి సహాయముపై మనము ఆధారపడకూడదు. ఆ విధమైన స్వతంత్రముతో మనము జీవించినప్పుడే పవిత్రమైన విలువలంతా ధైర్యముగా చాటటానికి

sri sathyasai vahini.

వీలవుతుంది.

**ఐకమత్యముతో సాధించలేనిది లోకములో ఏదీలేదు**

మానవతా విలువలను సాధించటానికి సంకల్పము కలిగిన వారందరుకూడి దీనిని ప్రభుత్వమునుండి దూరముచేసి విద్యావంతులు ఒక సొసైటీని స్థాపించి తద్వారా యీ Human Valuesను ప్రబోధ చేయటానికి తగిన కృషి చెయ్యాలి. ఈ Vice Chancellors అందరూ ఏకీభావముతో కూడినప్పుడు యెంతటి ఘనకార్యమునైనా సాధించవచ్చును. ఐకమత్యముతో సాధించలేనటువంటిది లోకములో వుండదు. ఈ Vice Chancellors లోనే ఐకమత్యములేదు. మన కాలేజీల్లోనే మనకు ఐకమత్యములేదు. పిల్లలకు, teachersకు మధ్య ఐకమత్యములేదు. Teachersకు Professorsకు మధ్య ఐకమత్యములేదు. ఇంక National Integration అంటే యే రీతిగా సాధించగలము? మొట్టమొదట మన గృహములో ఐకమత్యమును సాధించండి. ఇంటిలో తల్లి, తండ్రి, బిడ్డలు ఐకమత్యముగా మెలగండి. ఇంటిలోనే లేదు ఐకమత్యము. ఒంటిలోనే లేదు ఐకమత్యము. అటువంటప్పుడు దేశములో ఐకమత్యమనేది ఒక stunt అని చెప్పవచ్చును. దీనిపైన నాకు యేమాత్రము నమ్మకములేదు. కానీ, యీ Vice Chancellors చాలా ఆశ పడుతున్నారు. వారు సహృదయులై వుంటున్నారు. కాని, వారు మాత్రము యేమి చేయగలరు? దీనికి ప్రభుత్వములో అనేక విధములైన నిబంధనలు వుంటున్నాయి. నిజానికి మానవతావిలువల బోధన గవర్నమెంటు స్వాధీనములో యేమాత్రములేదు. ఒక ప్రోపర్టీ గాని, యింకొక విధమైన చట్టాన్నిగాని వారు తమ స్వాధీనమునందు వుంచుకోవచ్చునుగాని మానవతావిలువలను అణచిపెట్టటం వారి తరముగాదు. దేవాలయములు మరియు దేవాలయముల ఆస్తులను ప్రభుత్వము ఆక్రమించుకోవచ్చును. కానీ, భగవంతుని యేమాత్రము స్వాధీనము చేసుకోలేరు. మానవులను కంట్రోల్ చేయవచ్చును, ప్రభుత్వము. కానీ, విద్యార్థులయందు పవిత్రమైన ఆధ్యాత్మిక భావములు అభివృద్ధిగావించడాన్ని ప్రభుత్వము కంట్రోలు చేయలేదు. నైతిక, ఆధ్యాత్మిక విలువలు విద్యార్థులయందు ప్రవేశపెట్టినప్పుడు సహజముగా మానవతావిలువలు పెరుగుతాయి. ఇవి రెండు లేకుండా కేవలము మానవతావిలువలు

srisathyasaivachanamrutam

పెంచుకోండి, పెంచుకోండి అంటే యే విధముగా పెంచుకొనేది? ఎక్కడున్నాయని చూచేది? ఇవి కనుపించేవి కాదు. వినిపించేవి కాదు. కర్మఫలములను తినిపించేవి. వీటిని అంతర్దృష్టితో చూచినప్పుడే అగుపడుతాయిగాని కేవలము బహిర్దృష్టితో కనుపించేవికాదు. ఈనాడు మనము చక్కగా తరిఫీదు అవుతూ వస్తున్నాము. ఎక్కడ చూచినా Human Values develop చెయ్యాలని అంటున్నాము. ఇదేదో బయటినుంచి తెచ్చి పెంచే మొక్కల మాదిరి అనుకుంటున్నారు వాళ్లు. కాదు కాదు. ఎక్కడనుంచో తెచ్చేవికాదు. మననుంచే ఆవిర్భవిస్తున్నాయి.

## ప్రతి మానవుడు తప్పనిసరిగా మానవతా విలువలను పెంచుకోవాలి

ఈనాడు భక్తి యేవిధముగా వుంటున్నాది? 'సేవచేయునట్టి సేద్యపు పశువులను చేరి చితగగొట్టు, చిత్రముగను! రాతి పశువును చూడ తానె రక్తితో పూజించు!' చూశారా! రాయిగా వుండిన నందికి చక్కగా మ్రొక్కి మ్రొక్కి ప్రదక్షిణ చేస్తున్నాము, సజీవమైన గోవును పట్టుకొని చితకకొడుతున్నాము! ఈనాడు సజీవమైన మానవులను ప్రేమించాలి, నిర్జీవమైన శిలను ప్రార్థించటము కాదు. నిజానికి, ఉపకారము చేసే చెయ్యే చాలా గొప్పది. భగవన్నామము భజించేటువంటి, పరోపకారము చేసేటువంటి చేయి చాలా గొప్పది. ప్రతి మానవుడు మానవతావిలువలను తప్పని సరిగా పెంచుకోవాలి. అవి తనయందే వుంటున్నవి. అయితే, 'నాయనా! నీయందు మానవతావిలువలు వున్న'వని హెచ్చరించే వ్యక్తి ఒకరు కావాలి. ఒకరినొకరు దూషణ చేసుకోనక్కరలేదు. ఒకరినొకరు హింసించుకోకూడదు. ఒకరినొకరు బాధించుకోకూడదు. అందరియందు వుండిన ఏకత్వమే దైవత్వము. ఆ ఏకత్వాన్ని మనము భావించుకుంటే మానవత్వము మనయందే అభివృద్ధిగాంచుతుంది.

## ఎట్టి ప్రమాణములకు అందనివాడు, భగవంతుడు

యీనాడు యెవరికి వారే, యమునాతీరే! మానవునికి, మానవునికి మధ్య అనేక భేదభావములు యేర్పడుతున్నాయి. ఐకమత్యాన్ని పొందలేకపోతున్నారు. లౌకికమైన ఐకమత్యాన్నే సాధించలేని వారికి అంతర్ముఖమైన ఆనందము యేవిధముగా లభిస్తుంది?

sri sathyasaivachanamrutam

దేనికైనా ఒక ప్రమాణము వుంటుండాది. కానీ భగవంతునికి ప్రమాణము లేదు. అందువలననే అతనికి 'అప్రమేయుడు' అని పేరు వచ్చింది. ఎట్టి ప్రమాణములకు చిక్కనివాడు, భగవంతుడు. సముద్రాన్ని measure చేయవచ్చు. దైవప్రేమనుగాని, దైవసత్యమునుగాని, దైవధర్మమును గాని, దైవశాంతినిగాని కొలతలు వేయటానికి వీలులేదు. ఎవరికి తోచినట్లు వారు భావించుకోవచ్చు. దైవమునకు యెవ్వరిపైన యెట్టి ద్వేషముగాని, అసూయగాని, హింసగాని వుండవు. అలాంటి ప్రేమ తత్త్వాన్ని మనము పొందాలి. అది పొందాలంటే దైవమునుంచియే రావాలి. దైవమే వీటన్నింటికి main stores. ఆయన అనుగ్రహముచేత మనము వాటిని అందుకోటానికి సిద్ధముగా వుండాలి. దానితోపాటు లౌకిక మార్గమునందు మన జీవితాన్ని సార్థకము గావించుకోటానికి ప్రయత్నంచేయాలి. మీరు ఏది పలికినా సత్యమును పలకండి. నిజముగా సత్యమును పలకటము చాలా సులభము. అసత్యము పలుకుట చాలా కష్టము. కాని యేమిటో వారి దురదృష్టము, అసత్యము చెప్పటంవంటి కష్టమైనదానికే ప్రయత్నం చేస్తుంటారు. అసత్యాన్నే సులభముగా చెప్పటానికి ప్రయత్నిస్తున్నారు. కష్టాన్నే ఆశిస్తున్నారు. కానీ సుఖంగా లభించే సత్యానికి వారు యేమాత్రము నోచుకోలేకపోతున్నారు. 'సత్యం జన విరోధాయ; అసత్యం జన రంజనమ్', అన్నారు. ఈనాడు అందరూ అసత్యాన్ని ప్రేమిస్తున్నారు కాని, సత్యాన్ని ప్రేమించటంలేదు. కనుక, సత్యాన్ని ప్రేమించటానికి తగిన కృషి చేయండి. ఎలాంటి పరిస్థితిలో వుండినప్పటికి అసత్యాన్ని చెప్పకుండా చూడండి. ఎటువంటి కఠినమైన సమయమునందు కానీ నీ ధర్మాన్ని, నీ కర్తవ్యాన్ని విస్మరించకుండా చూసుకో. తప్పక నీకు సహజసిద్ధమైన శాంతి యేర్పడుతుంది.

అందరినీ ప్రేమించు. ప్రేమ ఒకరి సొత్తుకాదు. అది భగవంతునియొక్క స్వరూపము. అట్టి భగవంతుని ప్రేమను అందరికి అందించటానికి, నీవు అందుకోటానికి అధికారముంటూవుండాది. ఆ ప్రేమలో యింతో అంతో స్వార్థము చేరెనా అది మాలిన్యమైపోతుంది. పరిశుద్ధమైన అద్దములోనే మన ప్రతిబింబము సుస్పష్టముగా కనుపిస్తుంది. మన చిత్తమనే అద్దమునందు అపవిత్రమైన భావములు, అపవిత్రమైన చింతనలు అనే మాలిన్యాన్ని, మసిని పూసుకుంటే మన ప్రతిబింబము యేరీతిగా

sri sathyasai vahini

కనుపిస్తుంది? కనుక, మన విద్యాసంస్థలయందు పిల్లలకు మొట్టమొదట సత్యమును పలికే అలవాటు చెయ్యాలి. తమ తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించుకునే ధర్మాన్ని బోధించాలి. నిరంతరము ప్రశాంతముగా వుండమని వారిని ఆదేశించాలి. కష్టములుగాని, నష్టములుగాని, దుఃఖములుగాని వస్తూవుంటాయి, పోతూవుంటాయి. ఇవి passing clouds. కనుక, వీటి నిమిత్తమై యేమాత్రము worry కానక్కరలేదు. పరీక్షలో fail అయిపోయినావా worry కావద్దు. జయాపజయములు జీవితములో చాల సహజము. కనుక, ప్రశాంతముగా వారివారి జీవితాలను అభివృద్ధి పరచుకోమనాలి. యీ విధమైన courageను, encouragementను విద్యార్థులకు యివ్వాలి.

**దైవభావముతో ఏ కర్మలు ఆచరించినప్పటికి అవి మానవతా విలువలుగా రూపొందుతాయి**

ఈ విధమైన బోధలచేత పిల్లల మనసును మార్చాలి. లేతమొక్కలను యెంత చక్కని చెట్టుగానైనా మనము తయారుచేయవచ్చు. బలసిపోయిన చెట్టును వంచటానికి వీలుకాదు. వీరియందు పాతవి, రోతవి అంతా వేరులతోకూడి వుంటున్నాయి. అలాంటివారిని సరిదిద్దటము మనకు యేమాత్రము సాధ్యముకాదు. దీనివలన కాలమును వ్యర్థము చేసినవారమవుతాము. మొట్టమొదట బాలవికాస్‌ను అభివృద్ధి చేయండి. ఈ Balvikasను Primary Schoolలో ప్రారంభించండి. వారికి యీ విధమైన బోధనలు చేస్తుంటే క్రమంగా పెద్దవారయ్యేటప్పటికి వారి స్వభావములో అవి ఇమిడిపోతాయి. 'భారతదేశము Secular State' అంటే యేమిటి? అన్ని మతములవారిని ఆదరించటమే! ఏ మతమును ద్వేషించరాదు. అయితే Secular State అంటే మతరహితుడు కావడం కాదు. నీవు నీ మతమును ఆశ్రయించు. ఇతర మతములను యేమాత్రము దూషించటముగాని, తిరస్కరించటముగాని చేయకూడదు. మానవతా విలువలనేవి కేవలము ఒక మతమునకు సంబంధించినవికావు. ఈ విషయమును గమనించుకోలేక చాలామంది సత్యసాయి స్కూల్సులో, Higher Education అంతాకూడను ఒక మతసంబంధమైనదని అనేక పిచ్చి భావాలు ఏర్పరచుకున్నారు. ఈ అభిప్రాయము సరియైనదికాదు. ఈ మానవతా విలువలు సర్వమత సమన్వయమైనవి. సర్వమతసమ్మిళితమైనవి. హృదయమునకు

సంబంధించినవి. ఇలాంటి సర్వమతసమ్మతమైన ధర్మాన్ని మనము యీనాడు ప్రబోధ చెయ్యాలి. విద్యార్థులు ముందుగా అందరిపట్ల ప్రేమభావాన్ని పెంచుకోండి. ఈ ప్రేమభావముచేత ఎంతటి కార్యమునైనా సాధించవచ్చు. ఈనాడు యెన్నో మనము సాధిస్తున్నాము. ఎన్నో విద్యలు నేర్చుతున్నాము, నేర్పిస్తున్నాము. కానీ, ఆ విద్యలు యీనాడు మన నిత్య జీవితములో పనికి వస్తున్నాయా? చాలామంది Chemistry, Botany, Zoology ఇంకా యెన్నో subjects నేర్చుకుంటున్నారు. కాని వారు చదివేది ఒకటి, జీవితములో అనుభవించేది మరొకటి. చాలామంది MBBS పాస్ చేస్తున్నారు. ఇంజనీరుగా పాస్‌చేస్తున్నారు. కాని, ఈ చదువులు సార్థకము కావటంలేదు. మన పాఠ్యాంశములలో Human Values ప్రవేశపెట్టి యేమి ప్రయోజనము? ఆచరణలో పెట్టేవి మాత్రము మనము చదవాలి. కనుక ప్రతి ఒక్కటికూడను సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ అనేవి ఆచరణలో పెట్టండి. ఈ ఆచరణతోనే అభివృద్ధి చేసుకోవాలి. సాధ్యమైనంతవరకు పెద్దలు చెప్పే విషయాన్ని మననం చేసి తద్వారా మనయొక్క మానవతావిలువలు పెంచుకోవాలి. ఎన్ని చదువులు చదివినా దైవవిశ్వాసము మాత్రము దూరము చేసుకోకండి. దైవమునే వదలితివా నీవు జీవితమునే వదలినవాడవౌతావు. నీ ప్రాణమే దైవము. నీ జీవితమే దైవము. సర్వమూ దైవమే! దైవభావముతో నీవు యే కర్మలు ఆచరించినప్పటికిని అవి Human Valuesగా అవుతాయి. అవిలేకుండా artificial గా యెన్ని చేసినాగాని ప్రయోజనములేదు.

అన్నీ త్రికరణశుద్ధితో చేయండి! మనస్సు, వాక్కు, క్రియలతో మీరు ఆచరించండి! ఈనాడు యిక్కడ చేరిన ఉపకులపతులందరు పవిత్రమైన భావములతో నిర్ణయాలు చేశారు. వీరు చాలా పవిత్ర హృదయులు. మానవతావిలువలు పెంచుకోవాలనే భావనయందు వారికి పూర్ణ విశ్వాసముంటుండాది. అంతేకాకుండా సాధ్యమైనంతవరకు వారు వారి సంస్థలలోపల దీనిని సరియైన రీతిలో వినియోగించాలనే ప్రయత్నముతో వున్నారు. కానీ, వారికి పూర్ణస్వాతంత్ర్యములేదు. అయినప్పటికి, సాధ్యమైనంతవరకు వారు యేమాత్రము నిరుత్సాహపడకుండా దానిని సాధించటానికి పూనుకోవాలని నేను ఆశిస్తున్నాను. వారి హృదయాల్లో దైవము ప్రతిష్ఠ అయిపోయింది. దానిని వారు ఆశ్రయించనీ. దానిని వారు అనుసరించనీ. తప్పక వారి అభీష్టాన్ని సిద్ధి గావించుకోగలరు. ప్రేమస్వరూపులారా!

మీరందరు యిక్కడేకాదు, యెక్కడవుండినప్పటికి నిజమైన విలువ యేమిటంటే భగవంతుని మాత్రము విశ్వసించాలి. ఆ విశ్వాసాన్ని మీరు బలపరచుకుంటే అన్ని విలువలు అందులోనే చేరివస్తాయి. కష్టములయందు, సుఖములయందు మీరు దైవచింతన చేయండి. ఎలాంటి బలవత్తరమైన బాధలుకూడను జయించవచ్చును. కనుక, భగవంతుని భజించి, పూజించి, స్మరించి, తరించండి.

**(తేదీ 26-09-1987న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam